క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు



దోమకొండ: మండల కేంద్రంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో వారు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎక్సైజ్ ఎస్సై శ్రావణ్ కుమార్, కానిస్టేబుళ్లు జీవన్, శ్రీనివాస్, శరత్‌కుమార్, స్వాతి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై కోనారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని జగన్నాథ్‌పల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది సాయి శివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఎర్రాపహాడ్, కృష్ణాజీవాడి, దేవాయిపల్లి శివారులోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి ఎస్సై గణేష్ గురువారం ఫోన్‌ను అందించారు. మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన లునావత్ ప్రకాష్ ఈ నెల 20న ఎల్లారెడ్డిలో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో ఆన్‌లైన్ ద్వారా జప్తి జాన్కంపల్లిలో ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించామన్నారు.

చెక్కు అందజేత



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సీహెచ్ కల్యాణి సిబ్బందితో కలిసి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సీహెచ్ కల్యాణి మాట్లాడుతూ.. మండలంలోని తిమ్మనగర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన నామినీ అయిన భార్య కిష్టవ్వకు మంజూరైన రూ.2 లక్షల బీమా యోజన చెక్కును అందజేశామన్నారు.

నస్రుల్లాబాద్ ఎస్సైగా లావణ్య




నస్రుల్లాబాద్(బాన్సువాద): నస్రుల్లాబాద్ నూతన ఎస్సైగా ఆర్. లావణ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో కామారెడ్డి టౌన్‌లో బాధ్యతలు నిర్వహించారు. ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా హన్మండ్లు



బాన్సువాద: ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మారిశెట్టి హన్మాండ్లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగారాం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్‌లో చురుకుగా పని చేస్తున్న హన్మండ్లును నియమిస్తూ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపిగౌడ్



కామారెడ్డి టౌన్/కామారెడ్డిఅర్బన్: కామారెడ్డి గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గట్టగోని గోపిగౌడ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో గౌడ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా మోతే బాలరాజు గౌడ్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలో గౌడ సంఘం అభివృద్ధికి గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. గౌడ సంఘం ప్రతినిధులు తిర్మల్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ విజయ భాస్కర్ గౌడ్, తదితరులున్నారు.

అందని ఆసరా పింఛన్

- పోస్టాఫీస్ ఎదుట పింఛనుదారుల ఆందోళన
- సక్రమంగా ఇవ్వడం లేదంటూ ఆరోపణ



ఎల్లారెడ్డిలో పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న పింఛనుదారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): దసరా పండగ అందరి ఇళ్లలో ఆనందం నింపినా తమ ఇంటిలో మాత్రం సంతోషం కరువైందని వితంతు, ఒంటరి మహిళా పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆసరా, వితంతు, ఒంటరి మహిళలకు ప్రతి నెల 2016 రూపాయల పింఛన్ అందజేస్తోంది. కాని ఈనెలకు సంబంధించిన పింఛన్ ఇంకా రాకపోవడంతో ఇంటిలో పండుగ జరుపుకోలేక పస్తులున్నామని పింఛన్‌దారులు వాపోతున్నారు.

జిల్లాలో లక్షా 56 వేల 646 మంది..

జిల్లాలో వృద్ధాప్య పింఛన్‌దారులు 45 వేల 814, వితంతు 49 వేల 327, ఒంటరి మహిళలు 4,458, బీడీ కార్మికులు 37 వేల 33, చేనేత 647, గీత కార్మికులు 721, వికలాంగులు 18 వేల 646 మంది ఉన్నారు. వీరిలో వికలాంగులకు రూ.4,016 , మిగితా వారందరికి రూ.2016ల పింఛన్‌ను ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తుంది. ప్రతి నెలా ప్రభుత్వం మొదట్లో 5వ తేదీ లోగా పింఛన్ అందించేవారు. తరువాత రాను రాను 10వ తేదీకి.. దాని నుంచి 15వ తేదికి, మెల్లిమెల్లిగా 20వ తేదికి, అటు తర్వాత 25వ తేదికి మారింది. కనీసం పండగ తరువాతనైనా పింఛన్ ఇస్తారంటే అది కూడా సాధ్యం కాకపోవడంతో పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేశారు. పెన్షన్లు ఇచ్చి ఇబ్బందులను తొలగించాలని వారు అధికారులను కోరారు.

ఏమీ కొనలేని పరిస్థితి



దసరా పండగ గడిచినా ఇంత వరకు పింఛను రాలేదు. దీంతో ఇంట్లో చిన్నారులకు బట్టలు కొనలేని పరిస్థితి దాపురించింది. పండగ పూట ఏమీ కొనలేక ఇబ్బందులు పడుతున్నాం. – పాపవ్వ, పింఛనుదారు, ఎల్లారెడ్డి

డబ్బులు రాగానే అందిస్తాం..

పింఛన్ డబ్బులు ఇంకా రాలేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి.

– కాశీరాం, పోస్ట్‌మాస్టర్, ఎల్లారెడ్డి

నీటితొట్టి పరిశుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ రూరల్: మూగజీవాలకు కలుషిత నీరే దిక్కు అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పులికుచ్చతండాలో నీటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పశువుల నీటితొట్టిలో చెత్తాచెదారం చేరి పాకురు పట్టింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వెంకట్ కార్మికులతో శుభ్రం చేయించారు.

తాగునీటి పైపులకు మరమ్మతులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులు గురువారం తాగునీటి పైపులకు మరమ్మతులు చేపట్టారు. సాక్షి దినపత్రికలో కలుషితమవుతున్న తాగునీరు శీర్షికతో వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. 7వ వార్డులో మురికి కాలువలో ఉన్న కుళాయి పైపులు, కుళాయిలను తొలగించి నీరు కలుషితం కాకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాచప్ప, జీపీ అధికారులు తెలిపారు. ఎక్కడైనా పైపులు లీకేజీ ఉంటే ప్రజలు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేస్తే వెంటనే మరమ్మతులు చేస్తామని తెలిపారు.

పీవో, ఏపీవోలకు సక్రమంగా శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ ప్రభాకర్

ఎల్లారెడ్డి: పీవో, ఏపీవోలకు రెండు రోజుల పాటు శిక్షణ సక్రమంగా ఇవ్వాలని రిటర్నింగ్ ఆఫీసర్ మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28, 30 తేదీలలో ఎన్నికల విధుల గురించి పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని వీరికి మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏఆర్‌వో సురేష్, సెక్టార్ ఆఫీసర్లు తదితరులున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



బీజేపీలో చేరిన వడ్లం గ్రామ యువకులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. గురువారం వడ్లం గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి అరుణ తార ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. యువత కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలోకి చేరడానికి ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్, జిల్లా కార్యవర్గ కన్వీనర్ నవీన్ రెడ్డి, రవీందర్, విఠల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఎఫ్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సిద్ధిరాములు

కామారెడ్డి టౌన్/బీబీపేట/రాజంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో బీఎల్‌ఎఫ్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాధ సిద్దిరాములు, కార్యకర్తలకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఎల్‌ఎఫ్ ప్రజలకు చేసే సేవలను వివరించాలని తెలిపారు. గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని కోరారు. అలాగే బీబీపేట మండలం కోనాపూర్‌లో, రాజంపేట మండలం ఆరేపల్లి, ఆరేపల్లి తండాలో గ్రామాలలో ప్రచారం చేశారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, జిల్లా నాయకులు వడ్ల సాయికృష్ణ, జగదీష్, సబితా తదితరులున్నారు.

గాయత్రి షుగర్స్‌లో పూజలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో ఎండీ సరితారెడ్డి, బాయిలర్ పూజలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాల మధ్య హోమం జరిపించారు. ఈ సందర్భంగా సీడీసీ చైర్మన్ ఐరేండ్ల నర్సయ్య కార్మికుల సంక్షేమం కోసం పలు వినతులను ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సరితారెడ్డి, పీవో వేంకటేశ్వర్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మాల కొండయ్య, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా సురేందర్‌ను గెలిపించండి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్‌ను మరో మారు గెలిపించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కోరారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సురేందర్‌ను గెలిపించాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు.

సంక్షిప్తం

పారిశుధ్య పనులు చేపట్టాలి



పిట్లం(జుక్కల్): గోద్మెగాం, కారేగాం జీపీలను గురువారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు సందర్శించి పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీల పరిధులలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. రిజిస్టర్‌లను అప్డేట్‌గా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, శ్రీలత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ డిజిటల్ ప్రచారం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ డిజిటల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే హన్మంత్ సిందే వ్యక్తిగత సహాయకుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఊరూరా డిజిటల్ ప్రచారం చేస్తున్నారు.

గెలుపోటములు నిర్ణయించే శక్తి మాదిగలకు ఉంది



మాచారెడ్డి: ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే శక్తి మాదిగలకు ఉందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ స్పష్టం చేశారు. ఆయన గురువారం మాచారెడ్డిలో మాట్లాడారు. మాదిగల డిమాండ్లను నెరవేర్చకుండా చిన్నచూపు చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు ప్రవీణ్, జనార్దన్, రవి, కిషన్, రాజు, రాజెల్లం, పరశురామ్ ఉన్నారు.

కారు గుర్తుకే ఓటు వేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఓటర్లను కోరారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తు కరపత్రాలను అందజేశారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించండి

బీబీపేట: సీఎం కేసీఆర్ సొంత గ్రామం కోనాపూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని, ఇప్పటికే గ్రామం దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేశారని, గ్రామంలో పాఠశాలను నిర్మించారని నేతలు అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఏకం కావాలి

నస్రుల్లాబాద్(భాన్సువాద): నిరుద్యోగులు ఏకమై, మీ సర్టిఫికెట్ల జిరాక్సులను గోడలకు అంటించాలని బీసీ సంఘం రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పుట్ట భాస్కర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న హాల్ టికెట్లను సైతం గోడలకు అతికించి నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమం నిరసనలా మొదలై ఉద్యమంలా మారాలని ఆయన అన్నారు.

మేరా మిట్టీ మేరా దేశ్‌కు ఎంపిక

నస్రుల్లాబాద్(బాన్సువాద): మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమానికి నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ సేవా సంఘ్ ఎంపిక అయినట్లు యూత్ సభ్యులు సునీల్ రాథోడ్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని గురువారం ఎంపీడీవో రాము, వారికి అప్పగించారు. ఈ సందర్భంగా సునిల్ రాథోడ్ మాట్లాడుతూ.. ఢిల్లీలో నిర్మించే అమరుల స్మారకానికి ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నారని, ఆ కార్యక్రమానికి తాము ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు.

రైతు బంధును అడ్డుకోవడం సిగ్గుచేటు

- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మ దహనం

తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు నిధులను రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు కానీ, నవంబర్ 30న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కానీ విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనలు చేశారు. కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు అగ్ర నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రజలకు అందే సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు



భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో..



బీబీపేటలో..



దోమకొండలో..



నిజాంసాగర్‌లో..



మాచారెడ్డిలో ..

కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకం



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ రైతుల ద్రోహి పార్టీ అని మండల బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతుబంధు సాయం నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదును వెనిక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుబంధును నిలిపివేయాలని ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుబంధుకు ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన



కామారెడ్డి టౌన్/కామారెడ్డిఅర్బన్: కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స.హ. చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పించారు. అవినీతిని అంతం చేయడానికి ఈ చట్టాన్ని వినియోగించుకోవాలని కోరారు. అవగాహన పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ప్రతినిధులు ఈక శ్రీనివాస్, దొమ్మాటి లలిత, భాస్కర్, కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈనెల 29న ఎస్ఆర్ గార్డెన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని 'మెసేజ్ ఫర్ స్మైల్', కామారెడ్డి రక్తదాతల సమూహం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్, తదితరులు ఈ విషయం గురించి తెలిపారు. దాతలు 9492874006, 7095696736, 9553181399 నంబర్లకు సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో టిఫిన్ ప్రారంభం

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టిఫిన్‌ను గురువారం ఎంఈవో సేవులా ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థులకు టిఫిన్ తినిపించారు.విద్యార్థులకు టిఫిన్‌లు, భోజనాలు మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీలకు సేవులా సూచించారు.

కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలి

– సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమా



మాట్లాడుతున్న రమా

కామారెడ్డి టౌన్: కార్మికుల సమస్యలను రాజకీయ పార్టీలు, వారి మేనిఫెస్టోలో పొందుపర్చాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమా డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పరిపాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గానీ, గత పాలకులు గానీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తామని రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలడుగు సుధాకర్, జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మకు బోనాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): వడ్లం గ్రామంలో గురువారం ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించి, ముత్యాల పోచమ్మకు గ్రామస్తులందరూ కలిసి ఘనంగా బోనాలు తీసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శబరి మాత ఆశ్రమ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో గురువారం శబరిమాత ఆశ్రమ 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో భక్తులు అమ్మవారి చిత్ర పటంతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం ఆశ్రమం వద్ద అమ్మవారి పాదుక పూజ చేశారు. రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): మల్లూర్‌లో గురువారం స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ భిక్షపతి ప్రారంభించారు. వరి పంట నూర్పిడి చేసిన రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి విక్రయాలు జరపాలన్నారు. వరిధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సొసైటీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్, సొసైటీ సీఈవో సాయిలు తదితరులున్నారు.